క్లుప్తంగా

దీపావళి కానుకగా మొక్కలు



పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యురాలికి మారేడు మొక్క అందిస్తున్న ఆర్.వి.జె.నాయుడు

రాజాం: దీపావళి పండగ నేపథ్యంలో రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గత రెండేళ్లుగా పర్యావరణ పరిర క్షణకు కృషి చేస్తున్న ఈ సమితిలో సభ్యులుగా రెండువేలకుపైగా పర్యావరణ ప్రేమికులు ఉన్నారు. వీరందరికి దీపావళి కానుకగా ఒక్కో మొక్క చొప్పున అందిస్తున్నట్లు పర్యావరణ పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఆర్.వి.జె.నాయుడు తెలిపారు.పట్టణంలో పలు వార్డుల్లోని సభ్యులకు గురువారం మారేడు, నేరేడు, ఉసిరి మొక్కలను అందజేశారు.

రేపటి నుంచి చెకుముకి టాలెంట్ టెస్ట్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేవీవీ ప్రతినిధులు

బొబ్బిలి: జన విజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి నిర్వహించనున్న చెకుముకి టాలెంట్ టెస్ట్‌లను విజయవంతం చేయాలని జేవీవీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. సంబంధిత వాల్‌పోస్టర్లను స్థానిక గాంధీ బొమ్మ జంక్షన్ లో నిర్వాహకులు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా పాఠశాల, మండల, జిల్లా స్థాయిల్లో నిర్వహిస్తున్న ఈ టెస్ట్‌ల్లలో విజేతలుగా నిలిచిన వారికి రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మరిన్ని వివరాలకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలను సంప్రదించాలన్నారు. జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.సత్యం నాయుడు, ఉపాధ్యాయులు ఎస్.వి.రమణమూర్తి, కె.కృష్ణదాసు, రమేష్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం



అమ్మడమ్మ నుంచి కార్నియా సేకరిస్తున్న నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్

రాజాం సిటీ: మరణానంతరం దేహంతో పాటు నేత్రాలు మట్టిలో కలిసిపోకుండా నేత్ర దానం చేయడం ద్వారా ఇద్దరు అంధులకు కంటి చూపు ప్రసాదించవచ్చని భావించిన ఓ కుమార్తె తమ తల్లి నేత్రాలు దానం చేసేందుకు ముందుకు వచ్చారు. పట్టణ పరిధి అమ్మవారి కాలనీ 7వ లైన్‌కు చెందిన రవ్వ అమ్మడమ్మ (85) గురువారం మృతిచెందడంతో ఆమె నేత్రాలను దానం చేసేందుకు కుమార్తె ఎస్.ఉమాకుమారి, కుటుంబ సభ్యులు రాజాం రెడ్‌క్రాస్ సభ్యులకు సమాచారం అందించారు. రెడ్‌క్రాస్ రాజాం చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్ కుమార్, విజయనగరం రెడ్‌క్రాస్ సొసైటీకి చెందిన నేత్రసేకరణ కేంద్రం టెక్నీషియన్ వచ్చి అమ్మడమ్మ నుంచి కార్నియాను సేకరించారు. జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్, పిడుగు సూర్యారావు, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర లక్ష్యాలపై సమీక్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జెడ్పీ సీఈఓ సత్యనారాయణ

సంతకవిటి: స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనపై మండల పరిషత్ అధికారులతో శ్రీకాకుళం జిల్లా పరిష్ సీఈఓ డి.సత్యనా రాయణ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు.మండలంలోని 34 పంచాయతీల్లో పారిశుధ్య పనుల నిర్వహ ణపై ఆరా తీశారు. గ్రామాల్లో ఎక్కడెక్కడ చెత్త పేరుకుపోయి ఉందో మొదట గుర్తించాలని, ఆ చెత్తను సమీపంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించేలా చూడాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. డిప్యూటీ ఎంపీడీఓ లాస్య, జూనియర్ అసిస్టెంట్ విఠల్ పాల్గొన్నారు.

నందెన్న అనుపోత్సవాలు



రామభద్రపురంలో నందెన్న విగ్రహాన్ని ఊరేగిస్తున్న కర్నివీధి భక్తులు

రామభద్రపురం: పదిరోజుల క్రితం మండల కేంద్రంలో ప్రారంభ మైన నందెన్న సంబరాలు గురువారం అనుపోత్సవంతో ముగిశా యి. నందెన్న విగ్రహాలను భక్తులు తప్పెట గుళ్లు, కోలాటాలు,బ్యాండు మేళాలు, డీజేల మధ్య ఊరేగించి చెరువుల్లో నిమజ్జనం చేశారు.

రాజాంలో సమస్యలు జాం!

- ఖాళీ స్థలాల్లో ముళ్లపొదలు
- ప్రధాన వీధుల్లో మురుగు ప్రవాహాలు
- అనుసంధాన డ్రైనేజీ లేక అవస్థలు



రాజాంలోని వాసవీనగర్‌లో మురుగుకాలువలు లేక మట్టికాలువ ఏర్పాటు చేస్తున్న అధికారులు

రాజాం: రాజాం మున్సిపాలిటీ పరిస్థితి పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న సామెత మాదిరిగా తయారైంది. పేరుకు మున్సిపాలిటీ అయినప్పటికీ అభివృ ద్ధిలో, మౌలిక సదుపాయాలలో పంచాయతీల కంటే వెనుకబడి ఉందని పట్టణవాసులు చర్చించుకుంటున్నారు. మేజర్ పంచాయతీగా ఉన్న రాజాం లో అయిదు పంచాయతీలను విలీనం చేసి 2005లో నగరపంచాయతీగా చేశారు. 2018 లో మున్సిపాలిటీగా చేసినప్పటికీ ఇంతవరకు మున్సిపల్ ఎన్నికలు జరుగలేదు. 2021లో గ్రేడ్ 3 మున్సిపాలిటీగా ఉన్నతి లభించినప్పట్టికీ అభివృద్ధి మాత్రం అంతంత మాత్రంగానే ఉండిపోయింది. గతంలో ఉన్న 20 వార్డులు 24 వార్డులుగా మారాయి. గతంలో ఉన్న 25 వేల మంది ఓటర్లు 42 వేలకు చేరారు. 60 వేలకు దగ్గర్లో జనాభా ఉన్నారు. అభివృద్ధి మాత్రం రోజురోజుకూ దిగజారుతోంది.

ఖాళీ స్థలాలతో భయం భయం

పట్టణంలో అభివృద్ధిలేక ఇళ్ల స్థలాల ధరలు తగ్గుముఖం పట్టాయి. వీటికి తోడు రిజిస్ట్రేషన్ చార్జీలు పెరిగాయి. ఫలితంగా రోడ్డుకు ఆనుకుని ఉన్న స్థలాలు, షాపులు మినహా మిగిలిన వార్డుల్లోని ఇళ్ల స్థలాలు, ఇళ్లను ఎవరూ కొనుగోలుచేయడంలేదు. పలు వార్డుల్లో ఇళ్ల మధ్య ఖాళీగా ఉన్న స్థలాలు బాగుచేయడం, కంచెలు వేయడం వంటివి యజమానులు చేయకపోవడం,వాటిని మున్సిపల్ అధికారులు మెయింటెనెన్స్ చేయకుండా వదిలేయడంతో ముళ్లపొదలు పెరిగి ప్రమాదకర విష జంతువులు సంచరిస్తున్నాయి. దోమలు, పురుగులు, తేనెటీగలు చేరి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.



మల్లికార్జున కాలనీలో రోడ్డుమీదే మురుగునీరు



ముళ్లపొదలతో మారుతీనగర్‌లోని ఖాళీ స్థలాలు

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

మున్సిపాల్టీలో అభివృద్ధి పనుల నిమిత్తం ఏటా ఫైనాన్స్ నిధులు రూ. 50 కోట్ల మేర మంజూరీ అవుతుంటాయి. వీటిని పనులకు కేటాయించడం, తీర్మాణాలు చేయడం, టెండర్లు వేయడంలో అధికారుల అలసత్వం, పర్యవేక్షణలోపం కనిపిస్తోంది. ఫలితంగా ఈ నిధుల్లో పదిశాతం మేర కూడా ఖర్చు అవ్వడంలేదు. సరైన రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో ప్రధాన వార్డుల్లో మురుగునీరు ప్రవహిస్తోంది. చినుకుపడితే చాలు వార్డులన్నీ గ్రామీణ ప్రాంతాల్లోని పొలాల మీదుగా ఉన్న రోడ్లను తలపిస్తుంటాయి. ఇళ్లలోకి నీటి పాములు, కప్పలు, తేళ్లు, రోడ్డుమీద పడేసిన వ్యర్థాలన్నీ నీటితో వచ్చి చేరుతుంటాయి. కమిషనర్లు, అధికారులు మారడమే తప్ప పట్టణంలో అభివృద్ధి లేకపోవడంతో ఇక్కడ పనిచేసే వేలాదిమంది ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు కాస్త దూరమైనప్పటికీ తమ స్వగ్రామాల నుంచే రాజాం వచ్చి వెళ్లిపోతున్నారు.

ఇబ్బందులు పడాల్సి వస్తోంది



వర్షాకాలంలో వాసవీ నగర్ ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వర్షాలు కురిస్తే ఎగువ నుంచి వరద నీరంతా వాసవీ నగర్ సమీపంలోకి వచ్చి చేరుతుంటుంది.ఆసమయాల్లో వార్డులోకి వెళ్లి రాలేని పరిస్థితి తలెత్తుతోంది. పలువార్డుల్లోని ఖాళీ స్థలాల్లో పొదలు అల్లుకుంటున్నాయి. ఆయా ఇంటి స్థల యజమానులు పట్టించుకోవడం లేదు.దీంతో అక్కడ నివాసం ఉంటున్న వారు విష జంతువులు, కీటకాలతో ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులకు ఈ సమస్యలు ఏవీ పట్టవు.

– ఆర్.వి.జె.నాయుడు, రాజాం పర్యావరణ పరిరక్షణ కమిటీ సభ్యుడు

సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు



మా వార్డులో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు.వర్షం పడితే ఇళ్ల ముందు నీరు నిలిచిపోతోంది. మున్సిపల్ కేంద్రానికి కాస్త దూరంగా ఉండడంతో మా వార్డులో అసలు అభివృద్ధే లేదు.

– గడే అప్పలనాయుడు, అమ్మవారి కాలనీ, రాజాం

సమస్యలు గుర్తిస్తున్నాం



రాజాం మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో సమస్యలు గుర్తిస్తున్నాం. గ్రీవెన్స్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సమస్యలను గుర్తించి, డ్రైనేజీలు వేయడం, రోడ్లు నిర్మించడం చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను టెండర్ల ద్వారా పనులకు కేటాయిస్తున్నాం. చాలా మంది గిట్టుబాటు ఉండడంలేదని పనులు చేయకపోవడంతో నిధులు మిగిలిపోతున్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. రాజాంకు మున్సిపల్ ఎన్నికలు ఈ దఫా జరిగే స్థానిక ఎన్నికలతో కలిసి నిర్వహించే అవకాశం ఉంది. వార్డుల్లో ఖాళీ స్థలాలు గుర్తించి, ఆయా స్థలాల యజమానులకు నోటీసులు ఇస్తాం. వాటిని బాగుచేయించే చర్యలు తీసుకుంటాం.

– కె. శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్, రాజాం

పరామర్శ



కాంతారావును పరామర్శిస్తున్న తలే రాజేష్, వైఎస్సార్‌సీపీ నేతలు

రాజాం: మొగిలివలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు బౌరోతు కాంతారావును ఆ పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, పార్టీ నాయకులు గురువారం పరామర్శించారు. ఇటీవల కాంతారావు తల్లి బౌరోతు పెద్దమ్మి మృతిచెందారు.ఈ విషయం తెలుసుకున్న రాజేష్ గ్రామానికి చేరు కుని కాంతారావును, ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి, తమ సంతాపం తెలిపారు.స్థానిక సర్పంచ్ వాకముల్ల చిన్నం నాయుడు, వైఎస్సార్‌సీపీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, ఆర్‌టీఐ విభాగం కన్వీనర్ వంజరాపు విజయ్‌కుమార్, లెంక దామోదరనాయుడు, జిల్లా కల్చరల్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ బి. నరేంద్ర, నాయకులు లెంక గణనాథ, వెంకటరమణ, తాతప్పలనాయుడు, వంజరాపు వెంకటరమణ, పెదలంక శ్రీనివాసరావు, లెంక దాము, ఆబోతుల సీతారాం పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు, ఎండీఎం నిర్వాహకులు

తెర్లాం: విశాఖపట్నంలో ఈ ఏడాది డిసెంబర్ 30 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు సీఐటీయూ అఖిల భారత మహాసభలను నిర్వహించనున్నట్టు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.శంకరరావు తెలిపారు. మండలంలోని నందబలగలో మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) నిర్వాహకులతో కలిసి సీఐటీయూ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా శంకరరావు మాట్లాడుతూ మహాసభలను విజయవంతం చేసేందుకు సీఐటీయూ, దాని అనుబంధ సంఘాల వారందరినీ సమాయత్తం చేస్తున్నామని చెప్పారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, గ్రీన్ అంబాసిడర్లు, అసంఘటిత రంగ కార్మికులు పాల్గొనాలని కోరారు. సీఐటీయూ మండల నాయకులు గోపాలం, తదితరులు పాల్గొన్నారు.

కొట్లాట కేసు నమోదు

సంతకవిటి: సిరిపురం గ్రామానికి చెందిన కర్రి గణపతి సూర్యప్రకాశరావు పిర్యాధు మేరకు అయిదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ వి.రామకృష్ణ గురువారం తెలిపారు. కేసు వివరాలు.. బుధవారం సాయంత్రం కర్రి గణపతి సూర్య ప్రకాశరావు సిరిపురంలో తన ఇంటి ముందు ఉండగా, ఆయనపై అదే గ్రామానికి చెందిన ఆయని తోడల్లుడు డోల తిరుపతిరావు, వేరే వ్యక్తులు టి.లచ్చయ్య, డోల సీతారాం, ఏ.నీలకంఠేశ్వరరావు, పి.రామకృష్ణ పాత కక్షల నేపథ్యంలో దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిరయాదు మేరకు అయిదుగురుపై కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ స్పష్టం చేశారు. గణపతి సూర్యప్ర కాశరావు ప్రస్తుతం శ్రీకాకుళంలో చికిత్స పొందుతున్నారు. ఇదే సమయంలో డోల రామారావు కర్రిగణపతి సూర్య ప్రకాశరావు, ఆయన భార్యశాంతి కుమారి, కుమారుడుపై ఫిర్యాదు చేశారు. డోల తిరుపతిరావును గణపతి సూర్య ప్రకాశరావు, ఆయన భార్య ,కుమారుడు తిడుతుండడంతో ఎందుకు తిడుతున్నారని పక్కనే ఉన్న తాను అడగడంతో తనపై ఈ ముగ్గురూ రాళ్లతో దాడి చేశారని రామారావు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కర్రిగణపతి సూర్య ప్రకాశరావు, ఆయన భార్యశాంతి కుమారి, కుమారుడుపై కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

‘మాభూమి మాకిచ్చేయండి’



గ్రామసభకు హాజరైన దొంకినవలస రైతులు

బాడంగి: జూట్ మిల్లు కోసం 45 ఏళ్ల క్రితం తమ తాతలు భూములిచ్చారని, ఇంత వరకు ఆ కంపెనీ ఏర్పాటు చేయకపోవడంతో ఆభూములను తిరిగి తమకి ఇప్పించాలని, ఆభూములు ప్రైవేటు వ్యక్తులకు చెందకుండా చూడాలని మండలంలోని దొంకినవలస గ్రామ రైతులు ఇటీవల కలెక్టర్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌ను కోరారు. దొంకినవలస ఎత్తుఖానా సమీపంలో సుమారు 32 ఎకరాల జిరాయితీ భూము లను కలకత్తాకు చెందిన మహావీర్ కంపెనీకి జూట్ మిల్లు కోసం 1980లో రైతులు ఇచ్చారు.తర్వాత ఆ కంపెనీ ఆచూకీ లేకపోవడంతో ఆభూములను కొందరు వ్యక్తులు వారిపేరిట మ్యుటేషన్ చేయించుకునేందుకు చూస్తుండడంతో రైతులు కలెక్టర్‌ను ఆశ్రయించారు.కలెక్టర్ ఆదేశాలతో బొబ్బిలి ఆర్డీఓ రామమోహన్‌రావు దొంకినవలసలో గురువారం గ్రామ సభ నిర్వహించి, రైతుల అభిప్రాయాలను సేకరించారు. రైతులంతా ఆ భూములు తమకే చెందాలని ముక్తకంఠంతో చెప్పారు. మాభూములు తిరిగి మాకిప్పించాలని లిఖితపూర్వకంగా తెలియజేశారు. గతంలో కంపెనీవారు తమ పిల్లలకు ఉద్యోగాలిస్తామని ఆశ చూపించారని, ఎకరానికి రూ.1800 చొప్పున ఇస్తామని కంపెనీ వారు చెప్పడంతో గజపతినగరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో భూములను కంపెనీకి రిజిస్టర్ చేశామని ఇప్పటికీ కొంతమందికి డబ్బులు ఇవ్వలేదని రైతులు చెప్పారు.ఆర్డీఓ స్పందిస్తూ ఆర్ఓ ఆర్‌చట్టం ప్రకారం హక్కులు ఉన్న వారికే మ్యుటేషన్ చేస్తామని ఏ ఆధారాలు లేనివారికి ఎలా ఇచ్చేస్తామని అన్నారు. ఆ అధికారం తనకుకూడా లేదని, మీ అభిప్రాయాన్ని ఉన్నతాధికారులకు నివేదించి తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు యదాతధ స్థితి కొనసాగిస్తామని రైతులకు వివరించారు. తహసీల్దార్ వరప్రసాద్, ఆర్డీఓ కార్యాలయ హెచ్‌డీటీ రమేష్ పాల్గొన్నారు.

ఇరుముడులు, హుండీల ఆదాయం రూ.4.49 లక్షలు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ అమ్మవారి ఆలయంలో భవానీ మాలధారణ భక్తుల ఇరుముడి ఆదాయంతో పాటు హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 41 రోజుల పాటు దీక్షలు చేసిన భక్తులంతా దసరా సందర్భంగా ఇరుముడులు సమర్పించారు. ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు, పోలిపల్లిపైడితల్లి అమ్మవారి ఆలయ ఈఓ మాదవరావు సమక్షంలో ఇరుముడులు ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కించగా రూ.1,70,463 సమకూరాయని ఈఓ పి.శ్యామలరావు తెలిపారు. అలాగే హుండీ కానుకలు లెక్కించగా 36 రోజులకు రూ. 2,79,269 వచ్చాయని, మొత్తం ఆదాయం రూ. 4,49,732 లు వచ్చాయని చెప్పారు. అర్చకులు శ్రీనివాసరావుశర్మ, పర్యవేక్షకులు కూరాడ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న స్వాములు

రాజాం సిటీ: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో దోహదపడతాయని స్థానిక అయ్యప్ప స్వామి సన్నిదానం గురుస్వాములు కెంబూరు రామ్‌కుమార్, రెడ్డి రమేష్ అన్నారు. అయ్యప్పస్వామి మాలధారణ భక్తులు మున్సిపాలిటీ పరిధి పొనుగుటి వలసలో రోడ్డు పక్కన గురువారం పలురకాల మొక్కలు నాటారు. ఈ మొక్కలను పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యుడు రెడ్డి శ్రీనివాసరావు సమకూర్చారు.

నేటి నుంచి స్కూల్ గేమ్స్ పోటీలు

తెర్లాం: మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు మండల కో–ఆర్డినేటర్ సింహాచలం, హెచ్‌ఎం రమేష్ తెలిపారు. ఆట పోటీలకు సంబంధించి పాఠశాల మైదానంలో ఏర్పాట్లను గురువారం వారు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అండర్–14, 17 విభాగాల్లో బాల, బాలికలకు కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, వాలీబాల్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ధ్యానంతో పరివర్తన

బొబ్బిలి: ధ్యానం అన్ని రుగ్మతలనే కాదు, మనుషుల్లోని చెడు గుణాలు, ఆలోచనల నుంచి పరివర్తన చెందే శక్తిని ఇస్తుందని యోగా శిక్షకులు జామి భాస్కరరావు అన్నారు. అధికా రుల అనుమతులతో స్థానిక సబ్ జైలులోని రిమాండ్ ఖైదీలకు గురువారం ఆయన ధ్యానం నేర్పించారు. వివిధ కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న పలువురు రిమాండ్ ఖైదీలకు సబ్ జైలులోనే ధ్యానంపై శిక్షణనిచ్చారు. దీని వల్ల దుర్బుద్ధి, చెడు ఆలోచనలున్న వ్యక్తులకు మంచి బుద్ధి కలుగు తుందన్నారు. వారిలో పరివర్తన కలిగి సమాజంలో మంచిగా జీవిస్తారన్నారు.

రాష్ట్రవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



విద్యుత్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

రాజాం సిటీ: విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 17 నుంచి జరగనున్న రాష్ట్ర వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి సీహెచ్.రామ్మూర్తి నాయుడు కోరారు. రాజాంలో గురువారం మున్సిపల్ కార్మికులతోనిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ పిలుపులో భాగంగా విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల పోరాటానికి రాజాం కార్మిక సంఘాల ఐక్యవేదిక సంపూర్ణ మద్దతు ఇస్తుందని అన్నారు. సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని, రూ.కోటి ఇన్సూరెన్స్ కల్పించాలని, విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. జేఎల్ఎం గ్రేడ్–2 వారికి సర్వీస్ రూల్స్, ఉద్యోగుల డీఏలను వెంటనే విడుదల చేయాలని అన్నారు. పీస్ రేట్ కార్మికులకు, మీటరు రీడర్స్, బిల్ కలెక్టర్స్, స్టోర్ హమాలీలకు కనీసం వేతనం ఇవ్వాలని, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని, కారుణ్య నియామ కాల్లో అన్యాయాన్ని అరికట్టాలని కోరారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే బిల్లును వ్యతిరేకించాలని ,విద్యుత్ ఉద్యోగుల సమ్మెకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.వివిధ సంఘాల నాయకులు సత్యారావు, సురేష్, శంకరరావు, చిన్నారావు, అప్పలనాయుడు, చిరంజీవి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడిని ఖండిస్తూ రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న అంబేడ్కర్ పోరాట సమితి నాయకులు

రామభద్రపురం: దేశఅత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో చీఫ్ జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిషోర్ బూటు విసిరి దాడికి యత్నించడాన్ని అంబేడ్కర్ పోరాట సమితి నాయకులు ఖండించారు. సీజేఐపై దాడిని ఖండిస్తూ, హరియాణా ఐపీఎస్ అధికారి పూర్ణకుమార్ ఆత్మహత్యకు కారకులైన వారిని శిక్షించాలని కోరుతూ అంబేడ్కర్ పోరాట సమితి నాయకుడు సోరు సాంబయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం రాస్తారోకో చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ సీజేఐపై చేసిన దాడి రాజ్యాంగంపై జరిగిన దాడిగానే భావిస్తున్నామన్నారు.చట్టాన్ని చేతు ల్లోకి తీసుకునే హక్కు ఎవరికీ లేదన్నారు.సీజేఐపై దాడికి పాల్పడిన నిందితుడిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.అలాగే హర్యానా ఐపీఎస్ అధికారి పూర్ణకుమార్ ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ పోరాట సమితి నాయకులు యండ గోపాలరావు, వినోద్, తవుడు, లోకేష్, వెంకటరమణ,తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాల రాస్తున్న ప్రభుత్వాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పీకేఎస్, కలాసీ సంఘ నాయకులు

బొబ్బిలి: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాల రాస్తున్నాయని, ఈ ప్రభుత్వాల వైఖరికి నిరసనగా కార్మికులంతా ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని పీకేఎస్(ప్రగతి శీల కార్మిక సంఘం)జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు తమటాల అప్పలనాయుడు, రాయితి సత్యం పిలుపునిచ్చారు. స్థానిక కలాసీ సంఘ భవనం వద్ద ఐక్యపోరాటాలకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 8 గంటల పనివిధానాన్ని 13 గంటలకు పెంచుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టం చేసేందుకు చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. కార్మిక వర్గం తమ హక్కుల కోసం పాలక వర్గాలతో పోరాటాలు చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ తరహా చట్టాలు చేయడం అన్యాయమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాల సవరణ పేరుతో 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. ఈ విధానాలపై కార్మికులు,ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. దాసరి వెంకటరమణ,నల్లి తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆహార వృథాను అరికడదాం



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జె.సి.రాజు, తదితరులు

బొబ్బిలి: అన్నం పరబ్రహ్మ స్వరూపమని, ఆహారాన్ని వృథా చేయకుండా, మితంగా వినియోగించి మరింతమంది ఆకలి తీర్చేందుకు దోహదపడదామని కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జె.సి.రాజు అన్నారు. ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం సందర్భంగా స్థానిక కారుణ్య కార్యాలయంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది ఆహారం లేక అల్లాడుతున్నారన్నారు. మరోవైపు అంతకన్నా ఎక్కువ స్థాయిలో ఆహారం వృథా అవుతోందన్నారు. తిన్న దానికన్నా చెత్తబుట్టల్లో చేరుతున్నదే ఎక్కువ అని ఆవేదన చెందారు. ప్రతి ఒక్కరూ చేతులు కలిపి ఆహార వృథాను అరికట్టేందుకు కృషి చేయాలని స్థానికులకు పిలుపునిచ్చారు.కారుణ్య సంస్థ చీఫ్ ట్రస్టీ పి.వి.ఎ.మెర్సీరాజ్, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్,సభ్యులు రామకృష్ణ,అశోక్,చిన్నారావు,రాజు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపిక



జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికైన విద్యార్థినులతో ఎంఈఓలు, ఉపాధ్యాయులు


తెర్లాం: జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌కు ఉద్దవోలు హైస్కూల్, పెరుమాళి మోడల్ స్కూల్ విద్యార్థినులు ఎం.ఇందుమతి, ఎస్.ఉజ్వల ఎంపికయ్యారని ఎంఈఓ జె.త్రినాథరావు తెలిపారు.స్థానిక ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ సెమినార్‌ను గురువారం నిర్వహించారు. ‘క్వాంటమ్ ఏజ్ బిగెన్స్–పొటెన్షియల్స్ అండ్ చాలెంజెస్’ అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో మండలంలోని అన్ని హైస్కూళ్లు, పెరుమాళి మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థిని ఎం.ఇందుమతి ప్రథమ స్థానం, ఎస్.ఉజ్వల ద్వితీయ స్థానంలో నిలిచి జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌కు మండలం తరఫున అర్హత సాధించారు. శుక్రవారం ఉదయం 10గంటలకు విజయనగరంలోని మహారాజా సంస్కృత హైస్కూల్‌లో నిర్వహించే జిల్లాస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని ఎంఈఓ తెలిపారు. ఎంఈఓ–2 పాపారావు, తెర్లాం హైస్కూల్ హెచ్‌ఎం రమేష్, మండలంలోని సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేడు గ్రామస్థాయి కమిటీల ఏర్పాటు

మెంటాడ: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరిస్తున్న తీరును వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ అధిష్టానం కోటి సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టింది. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వల్ల కలిగే నష్టాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు కూటమి ప్రభుత్వం తీరును వ్యతిరేకిస్తూ సంతకాలు సేకరించేందుకు గ్రామస్థాయి కమిటీలు వేయనున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రాయిపల్లి రామారావు గురు వారం తెలిపారు.మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామస్థాయి కమిటీలను నియ మించనున్నట్లు చెప్పారు. చింతలవలస గ్రామ సమీపంలోని కల్యాణ మంటపంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

అన్ని రంగాల్లో రాణించాలి



విజేతలతో ఎంఈఓ కూర్మినాయుడు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు

వంగర: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటూ, శాస్త్ర సాంకేతిక, అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈఓ–2 మీసాల కూర్మినాయుడు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సైన్స్ సెమినార్ పోటీలు గురువారం నిర్వహించారు. ‘క్వాంటం యుగం ప్రారంభం– అవకాశాలు, సవాళ్లు’ అనే అంశంపై ఈ పోటీలు జరిగాయి. అరసాడ ఉన్నత పాఠశాల విద్యార్థి లచ్చుభుక్త జయచరణ్ నాయుడు ప్రథమస్థానంలో నిలవగా, వంగర ఉన్నత పాఠశాల విద్యార్థిని మొగిలి భార్గవి ద్వితీయ స్థానంలో నిలిచారు. విజేతలకు ఎంఈఓతోపాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

రేగిడి: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీడీఓ శ్యామలాకుమారి అన్నారు. మండలంలోని పనసలవలస ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె వ్యాయామ ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థులకు ఇష్టమైన క్రీడలను తెలుసుకుని వారికి వాటిపై తర్ఫీదు ఇవ్వాలని చెప్పారు. క్రీడలు మానసిక ఉల్లా సా నికి, శారీరక ధృడత్వానికి దోహదపడతాయని అన్నారు.

కంటి శస్త్ర చికిత్సలకు 22 మంది ఎంపిక

రాజాం సిటీ: స్థానిక తాణావీధి విష్ణుకోవెలలో వాసవీక్లబ్ మన రాజాం–సారథి ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు శిబిరంలో మొత్తం 95 మందికి నేత్రపరీక్షలు చేశారు. వీరిలో 22 మందిని చికిత్సలకు ఎంపిక చేసినట్లు వాసవీక్లబ్ సభ్యులు తెలిపారు.

పొరపాట్లకు తావివ్వొద్దు

రేగిడి: పొరపాట్లకు తావివ్వకుండా భూముల రీసర్వేను సక్రమంగా చేపట్టాలని తహసీల్దార్ ఐ.కృష్ణలత సర్వే సిబ్బందికి సూచించారు. చాటాయివలస గ్రామంలో చేపడుతున్న రీసర్వేను గురువారం ఆమె పరిశీలించారు. సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామానికి సంబంధించిన మొత్తం భూమిని పూర్తిగా సర్వేచేసి రెండు రోజుల్లో నివేదికలను అందజేయాలని వీఆర్ఓ రామకృష్ణను ఆదేశించారు. సర్వే చేసే సమయంలో భూమికి సంబంధించిన రైతు తప్పనిసరిగా ఉండేలా చూడాలని అన్నారు.